క్లుప్తంగా

బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయం ప్రారంభం



పూజలు చేస్తున్న జెడ్పీటీసీ కోవ అరుణ

జైనూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి పార్టీ క్యాంప్ కార్యాలయాన్ని సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణ సోమవారం ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, నాయకులు డోంగ్రే సమాధాన్, ముండే సతీశ్, జుగదిరావు, జాడి రవీందర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో హరీశ్‌బాబు

చింతలమానెపల్లి/కాగజ్‌నగర్‌రూరల్: చింతలమానెపల్లి మండలంలోని బాబాసాగర్, దహెగాం మండలం రావులపల్లి గ్రామాలకు చెందిన యువకులు, పలువురు బీఆర్ఎస్ నుంచి సోమవారం బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు వారికి కండువా కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. సిర్పూర్‌లో పార్టీ విజయం ఖాయమన్నారు. పార్టీ నాయకులు ఎల్ములె మల్లయ్య, రాపర్తి ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

గొల్లగూడలో వైద్యశిబిరం



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని బంబార పంచాయతీలో గల గొల్లగూడలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. 8 మంది జ్వర పీడితులకు ఆర్డీటీ, మలేరియా పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించారు. అనంతరం సీజనల్ వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డ్రైడే నిర్వహించి నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మురుగుకాలువల్లో యాంటీ లార్వా మందులు వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, హెల్త్ అసిస్టెంట్ భగవాన్ దాస్, ఏఎన్ఎం సునంద, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి వసతి, దివ్యాంగుల కోసం ర్యాంపు సౌకర్యం తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ సిద్దిక్ ఉన్నారు.

నేడు కాంగ్రెస్ మండల స్థాయి సమావేశం

బోథ్: బోథ్ నియోజవర్గంలోని పది మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల అబ్జర్వర్ రాథోడ్ ప్రకాష్ మంగళవారం సమావేశం కానున్నట్లు లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ బోథ్ నియోజకవర్గ సమన్వయకర్త పసుల చంటి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేరడిగొండ 12.30లకు, బోథ్ 2.00లకు, సొనాల 2.30 లకు, ఇచ్చోడ 3.30 లకు, గుడిహత్నూర్ 4.30లకు, సిరికొండ 5.00లకు. బజార్‌హత్నూర్ 5.30లకు, తలమడుగు 6.30 లకు, తాంసి 7.00లకు, భీంపూర్ 7.30 గంటలకు ఆయా మండల పార్టీ కార్యాలయాల్లో కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ప్రతి నాయకుడు, కార్యకర్త పాల్గొనాలని కోరారు.

జోరుగా గ్లైఫొసెట్ దందా

- మహారాష్ట్ర సరిహద్దు నుంచి అక్రమ రవాణా
- పెన్‌గంగ, వార్ధా నదుల ద్వారా నాటుపడవల్లో తరలింపు
- గడ్డిమందు నిల్వ చేసుకుంటున్న దళారులు
- రైతులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వైనం



నిషేధిత గడ్డిమందు వినియోగం తర్వాత పత్తి చేను ఇలా..



పోలీసులు పట్టుకున్న నిషేధిత గడ్డిమందు(ఫైల్)

కౌటాల: మండలంలో గ్లైఫొసెట్ (నిషేధిత గడ్డిమందు) దందా జోరుగా సాగుతోంది. సరిహద్దున మహారాష్ట్ర ఉండడంతో దళారులు రోడ్డు మార్గాన అక్రమంగా తరలిస్తున్నారు. గొండాయిపేట, వీర్దండి, తాటిపల్లి గ్రామాలు ఆనుకొని ఉన్న పెన్‌గంగ, వార్ధా నదుల ద్వారా నాటుపడవల్లో తరలించి నిల్వ చేస్తున్నారు. రైతులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఏటా ఖరీఫ్ ప్రారంభంలో వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నా..దళారులు వారికి కంటపడకుండా తమ దందాను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో గ్లైఫొసెట్ విక్రయాలపై నిషేధం ఉన్నా కొందరు ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాల నిర్వాహకులు విక్రయాలు చేస్తున్నారు. అలాగే పంటల దిగుబడికి రైతులకు అధికారులు సూచించిన మందులే విక్రయించాల్సి ఉన్నా వ్యాపారులు తమ వద్ద పురుగు మందులను వారికి అంటగడుతున్నారు. పంటలకు వాటిని పిచికారీ చేస్తుండడంతో నష్టపోతున్నారు. దాంతోపాటు పర్యావరణంతోపాటు రైతుల ఆరోగ్యానికి హాని చేస్తున్నాయి.

నిషేధిత మందుతో నష్టాలు..

మండలంలో వానాకాలం సీజన్‌లో రైతులు పత్తి, వరి, సోయా పంటలు సాగు చేశారు. సీజన్ ఆరంభంలో వర్షాలు ఆలస్యంగా కురిసినప్పటి నుంచి పత్తి పంట వేశారు. సుమారు 18 వేల ఎకరాల్లో సాగైంది. ప్రస్తుతం పత్తిలో కలుపు పెరిగింది. కలుపుతీతకు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో రసాయన మందులపై దృష్టిసారిస్తున్నారు. దీన్ని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడ నుంచి నిషేధిత గడ్డి మందు(గ్లైఫొసెట్)ను తీసుకువచ్చి రూ.3 వేలకు 5 లీటర్ల చొప్పున విక్రయిస్తున్నారు. రైతులు గ్లైఫొసెట్‌తో పంటకు పిచికారి చేస్తున్నారు. దీన్ని వాడడం వల్ల భూసారం తగ్గిపోతుంది.

కంపెనీల ఆఫర్ల ఆశతో..

కౌటాల మండలంలో 28 ఫెర్టిలైజర్ దుకాణాలున్నాయి. అనధికారికంగా గ్రామాల్లో మరికొన్ని దుకాణాలు కొనసాగుతున్నాయి. పురుగు మందు ఎక్కువ విక్రయించిన వ్యాపారులను విదేశీ విహారయాత్రలకు తీసుకెళ్తామని కంపెనీలు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. కంపెనీల మందు పిచికారి చేస్తే పంట ఏపుగా పెరుగుతుందని, పెద్ద సైజు కాయలు వస్తాయని, దిగుబడి వస్తుందని రైతులకు ఆశ చూపుతున్నారు. అలాగే దళారులు ఇతర ప్రాంతాల నుంచి నిషేధిత గ్లైఫొసెట్ గడ్డి మందును వారికి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిషేధిత గడ్డి మందును నిషేధించిందని, వ్యవసాయాధికారి రాసిచ్చిన చీటీ ఆధారంగానే పురుగు మందులను రైతులకు విక్రయించాలని డీలర్లకు సూచిస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఆర్నెల్లకే కంకరతేలి..



కంకర తేలిన రోడ్డు

- గోయెగాంలో సీసీ రోడ్ల దుస్థితి
- నాణ్యతకు తూట్లు.. నాసిరకం పనులు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



గోయెగాంలో పగుళ్లు తేలిన రోడు

తిర్యాణి: మండలంలోని గ్రామాల్లో రోడ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. అయితే టెండర్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్.. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలకు తూట్లు పొడిచి నాసిరకం పనులు చేపట్టారు. దీంతో కొన్నినెలలకే పగుళ్లు ఏర్పడి కంకరతేలి దర్శనమిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. సంబంధిత శాఖ ఇంజినీర్లు, అధికారుల పర్యవేక్షణ లేక సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరితో నాసిరకంగా రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. గోయెగాం పంచాయతీ పరిధిలో గత ఆరునెలల క్రితం రూ.20 లక్షల వ్యయంతో నాలుగు సీసీ రోడ్ల నిర్మించారు. అవి ప్రస్తుతం పగుళ్లు ఏర్పడి కంకరతేలి కనిపిస్తోంది. కనీసం క్యూరింగ్ చేయకుండా ఇష్టానుసారంగా ఎంబీ రికార్డు చేసి నిధులు విడుదల చేసినట్లుగా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షేత్రస్థాయిలో రోడ్డు నిర్మాణంలో ఉపయోగించిన మెటీరియల్‌ను పరిశీలించాకే నిధులు విడుదల చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదని తెలుస్తోంది. కేవలం గోయెగాం పంచాయతీ పరిధిలోనే కాదు మిగతా గ్రామాల్లో ఇలాంటి పరిస్థితే నెలకొని ఉంది. ఇప్పటికైన సంబంధితశాఖ అధికారుల పర్యవేక్షణలో రోడ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



గ్రామంలో వేసిన రోడ్డు ఆరు నెలలకే కంకర తేలి అధ్వానంగా మారింది. అధికారులు పట్టించుకోవడం లేదు. వచ్చే వర్షాకాలం వరకైనా రోడ్డు ఉంటుందో లేదో తెలియదు. నాసికరంగా వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి. మళ్లీ కొత్తగా రోడ్డు నిర్మించాలి.

– చిత్రం శంకర్, బోరింగ్‌గూడ (గోయెగం), తిర్యాణి

మరమ్మతు చేయిస్తాం

గోయెగాం పంచాయతీ పరిధిలో నిర్మించిన సీసీ రోడ్లు కంకర తేలినట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి సదరు కాంట్రాక్టర్‌తో మరమ్మతు పనులు చేయిస్తాం.

– సువాస్, పంచాయతీరాజ్ ఏఈ, తిర్యాణి

ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వద్దు

దహెగాం: ఎన్నికల విధుల పట్ల అధికారులకు నిర్లక్ష్యం వద్దని తహసీల్దార్ కవిత అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దని అన్నారు. గోడ రాతలు, ప్లెక్సీలు ఉన్నట్లయితే వాటిని వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కవిత →

ఆటో బోల్తా



కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నామానగర్ వంతెన వద్ద సోమవారం ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. వారిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పెంచికల్‌పేట నుంచి కాగజ్‌నగర్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో నామానగర్ వంతెన సైడ్‌వాల్‌ను తాకి బోల్తా పడింది. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్‌ను సంప్రదించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

బతుకమ్మ సంబురాలు



ఆసిఫాబాద్‌లో..



కాగజ్‌నగర్‌లో..



బతుకమ్మలతో డీఐఈఓ శంకర్, అధ్యాపకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బతుకమ్మ సంబురాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులు, యువతులు రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. జిల్లాకేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్, డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకకు డీఐఈఓ నైతం శంకర్ హాజరయ్యారు. డీజే పాటలకు విద్యార్థినులు కోలాటం ఆడారు. దాండియా నృత్యం చేశారు. కళాశాల కరస్పాండెంట్ సాయిని రాజశేఖర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో ఆలయాలు, వివిధ కూడళ్ల వద్ద సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల్లో అంటూ మహిళలు, యువతులు ఆడిపాడారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని వసుంధర జూనియర్, డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు కోలాటాలతో నృత్యం చేశారు.

‘24గంటల విద్యుత్ సరఫరాలో బీఆర్ఎస్ విఫలం’



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బేల: వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరాలో విద్యుత్ సరఫరాలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరంతరం విద్యుత్ అంతరాయ సమస్యపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15న రాత్రివేళ 7గంటల మండల వ్యాప్తంగా తీవ్ర విద్యుత్ అంతరాయంతో దేవి నవరాత్రి ఉత్సవాల్లో చీకట్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. చివరగా ఏఈ సంతోష్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు అఖిల్, విపిన్ పాల్గొన్నారు.

సమాజసేవలో ముందుండాలి



సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: మరిన్ని సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలవాలని మంచిర్యాల జిల్లా స్వచ్ఛంద సంస్థ సభ్యులు రహీమ్, సలీమ్‌లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బెస్ట్ ఫ్రెండ్ సొసైటీ అధ్యక్షుడు అజీజ్‌ను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.



కెరమెరిలో..



ఆసిఫాబాద్‌లోని గాంధీ చౌక్ వద్ద..



కౌటాల: పూజలు చేస్తున్న మహిళలు

దుర్గామాతకు పూజలు



దహెగాం: బాలాత్రిపుర సుందరీ దేవి రూపంలో అమ్మవారు



దహెగాం: పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఆలయాలు, దుర్గామాత మండపాల్ల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. కేశవనాథ ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకుడు నరేశ్ శర్మ ఆధ్వర్యంలో పూజలతోపాటు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

దహెగాం: స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి సోమవారం రెండవ రోజు బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కెరమెరి: మండలవ్యాప్తంగా దుర్గాదేవి మండపాల్ల వద్ద సోమవారం భక్తులు పూజలు చేశారు. పలుచోట్ల అన్నదానం నిర్వహించారు.

కౌటాల: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో శ్రీ శారదా దేవి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం మహిళలు నిర్వహించిన దాండియ నృత్యం ఆకట్టుకుంది. దుర్గాదేవి మండపం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఈనెల 24వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ మేనిఫెస్టో



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇంద్రవెల్లి: సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఉందని ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలు తెలిసిన ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ ప్రజలకు మరింత చేరువయ్యేలా అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. గత ఎన్నికల్లో చెప్పిన హామీలు కూడా అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, ఇప్పుడు మేనిఫెస్టో పెట్టిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లో అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ షెక్ సుఫీయన్, ఎంపీటీసీ కోవ రాజేశ్వర్, నాయకులు కనక తుకారం, కనక హనుమంత్‌రావ్, రాథోడ్ పర్సురాం నాయక్, పోటే సాయినాథ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎంపీ పరామర్శ

నేరడిగొండ: మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మడావి కృష్ణ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎంపీ గొడం నగేష్ సోమవారం వారి నివాసానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు గాదె శంకర్, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, మాజీ ఎంపీటీసీ ఆత్రం లక్ష్మణ్, మురళి గౌడ్, వెంకటరమణ, లస్మన్న తదితరులు ఉన్నారు.

మూఢనమ్మకాలు విశ్వసించొద్దు



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ప్రతినిధి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాలు విశ్వసించొద్దని సూచించారు. సైన్స్ ప్రాముఖ్యత, అభివృద్ధిపై వివరించారు. ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి రూపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.